తాసిల్దార్ కు వ్యతిరేకంగా ఫిర్యాదు

విచారణ నివేదికకు లోకాయుక్త ఆదేశం

విశాలాంధ్ర-పరవాడ : గత పరవాడ తహసిల్దార్ డి.శాంతి భూషన్ రావుకు వ్యతిరేకంగా చేసిన ఫిర్యాదును లోకాయుక్త న్యాయస్థానం విచారణకు స్వీకరించి నివేదిక కోరినట్లు గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన చిప్పాడ అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటి ప్రవాహ భూములకు, ప్రభుత్వ భూములకు చెందిన రికార్డులు ఆన్లైన్లో మారిపోయినట్లు గతంలో అనేక దఫాలు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. కొద్ది నెలల తర్వాత తాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏం చర్యలు తీసుకున్నారంటూ సమాచార చట్టం ద్వారా సంబంధిత అధికారులను వివరాలు కోరగా నిరాకరించారని అన్నారు. ఇదే విషయమై అన్ని ఆధారాలతో లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా తన ఫిర్యాదును స్వీకరించడంతో పాటు విచారణకు సంబంధిత న్యాయస్థానం ఆదేశించినట్లు అప్పారావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అల్పపీడనం పై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: అల్పపీడనం పట్ల జిల్లా యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్ అప్రమత్తం చేశారు. 23 నుండి 26వ వరకు దానా తుఫాను కారణంగా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జిల్లా యంత్రాంగాన్ని సంసిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాల యంలో కంట్రోల్ రూమ్- 08924-226599,222888 ఏర్పాటు చేసారు. అల్పపీడనం, వర్షాలు పట్ల జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్పి, సీహెచ్ డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆమె ఆదేశించారు. అధికారులుఅప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. వర్షాలు వలన మంచినీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని, మంచినీటి వనరులను, పైపులైనులను తనిఖీ చేయాలని, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు యిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని ఆమె తెలిపారు. అటువంటి ప్రదేశాల్లో సూచనల బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, స్లాబ్ లు పడిపోయే అవకాశం ఉన్న భవనాలు, మట్టి ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత భవనాల్లోకి మార్చాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. తుఫాను కారణంగా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా

చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ఎటువంటి దుర్ఘటనలు సంభవించరాదని జిల్లా కలెక్టరు స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులకు అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను అదేశించారు. ఈ సమావేశంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీగా తుహిన్ సిన్హా బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం సిటీ డిసిపి-2 గా పనిచేస్తూ, అనకాపల్లి జిల్లా ఎస్పీగా బదిలీ పై వచ్చి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తుహిన్ సిన్హా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. 2017 బ్యాచ్ కి చెందిన తుహిన్ సిన్హా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా 2023 నుండి 2024 ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీ గా 2021-22 సంవత్సరంలో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్థానిక మీడియాతో మాట్లాడుతూ.అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. పోలీసు శాఖకు మంచి పేరు తెచ్చేలా పనిచేస్తానని, గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పటిష్టంగా ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తామన్నారు. సైబర్ క్రైమ్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకుంటానని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల సహకారంతో వారి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని ఇందుకు పోలీస్ అధికారులు, మీడియా సహకారం అందించాలని తెలియజేశారు. అనంతరం పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద గౌరవ వందనం చేసి పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు, అనకాపల్లి సబ్ డివిజన్ ఇన్చార్జి డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, బాల సూర్యరావు, లక్ష్మి, వినోద్ బాబు, రమేష్, మన్మధరావు, సతీష్, నరసింహమూర్తి, సంజీవరావు ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటరీ వ్యవస్థను కొనసాగించాలి

విశాలాంధ్ర-అనకాపల్లి: వాలంటీర్ కు బకాయిలపడ్డ నాలుగు నెలల గౌరవ వేతనం చెల్లించాలి వారినే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వాలంటరీ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద వాలంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మేము అధికారంలోకి వస్తే వాలంటరీ పదివేల రూపాయలు గౌరవ వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని దొరబాబు డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవలందించిన వాలంటరీ వ్యవస్థ సేవలను మనం గుర్తించాలని తెలిపారు.రాజకీయ ఒత్తిడి కారణంగా రాజీనామా చేసిన వారందరిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ ఎనిమిది క్యాబినెట్ సమావేశాలు జరిగిన వాలంటరీ వ్యవస్థ కోసం కనీసం చర్చించకపోవడం బాధాకరమని దొరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే వాలంటరీ వ్యవస్థ కొనసాగించడానికి, బకాయిలు చెల్లించుటకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి. ప్రవీణ్, ఆశీనా, సురేష్ ,విజయ్ ,లావణ్య, చంద్రిక, ఉమా భానుప్రియ ,లావణ్య, దేవి పాల్గొన్నారు.

కాలుష్య నురగ.. కాసారం నిండుగా ...

వ్యర్థ రసాయనాలతో కలుషితమైన పెదమొల్లోడు గెడ్డ

పెద్దచెరువు కలింగ వద్ద కలుషిత నీటి ప్రవాహంలో నురగలు కక్కుతున్న దృశ్యం

విశాలాంధ్ర-పరవాడ: ఔషధ పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలు ప్రజలకు విషంగా మారుతున్నాయి. పరవాడ జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని పలు పరిశ్రమలు నిబంధనలు మరచి రసాయన వ్యర్థ జలాలను ఇష్టా నుసారంగా వదిలేస్తున్నాయి. ఆ ప్రమాదకర రసాయన జలాలు పెదమొల్లోడు గెడ్డలో నేరుగా కలుస్తున్నాయి. ఈ గెడ్డలో నుంచి ప్రవహించి పరవాడ పెద్ద చెరువులో చేరుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు వ్యర్థాలను బయటకు వదిలేస్తుండటమే ఇందుకు కారణం. ఇవి జనావాసాల మధ్య నుంచి పారటం, జల, వాయు కాలుష్యం కలిగిస్తుండటంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చెరువు క్రింద రైతులు ఇదే కలుషిత నీటితో సాగు చేస్తుండటం ఆందోళన కలిగించే విషయం. ఇప్పటికైనా సంబంధిత కాలుష్య నియంత్రణా మండలి అధికారులు ఇలాంటి వాటిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం కూడా ఫార్మా పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-నక్కపల్లి: రాజ్ కమల్ ,వింగ్స్ ఫౌండేషన్ సేవలు ఎనలేనివని ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.సత్య నారాయణ అన్నారు. సోమవారం ఎన్.ఎమ్.ఎమ్.ఎస్. పరీక్షలకు హాజరయ్యే ఎనిమిదవ తరగతి విద్యార్థులకు మండలంలో పెదబోదుగల్లం హైస్కూలులో ఆ సంస్థ వ్యవస్థాపకులు ఎర్రమిల్లి వెంకట జయరాం ,కార్యదర్శి జయప్రకాష్ చేతులమీదుగా ఈ పుస్తకాలను పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా పాఠశాల విద్యార్థులకు ఉచితసేవలందిస్తున్నామని అన్నారు.పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం, మరియు అనాథశరణాలయాలను నిర్వహించడం ఈ సంస్థ తరపున జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఫల్గుణరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

విశాలాంధ్ర -పాయకరావు పేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18 వ తేదీ విశాఖపట్నంలో జరిగిన అండర్-19 హ్యాండ్ బాల్ బాలుర, బాలికల జిల్లా జట్టు ఎంపికలో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. బాలురు ఈ నెల 25వ తేదీ నుండి 27 వరకు విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో, బాలికలు ఈ నెల 23వ తేదీ నుండి 25 వరకు కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన బాలికల్లో పి. అలేఖ్య, ఆర్. వైష్ణవి, ఎన్. సాహితీ చందన, ఆర్ మోహిత, ఎంపికైన బాలురలో ఎ. జ్యోతిష్ కుమార్, జి. అభినయ్, బి. యశ్వంత్, కె. జితేంద్ర, ఆర్.కుమార్, వై. జయ సత్య కుమార్, కె. వెంకటేష్, జి.మురళి, ఎన్. గోపి, బి.మౌనిక్ ఉన్నారు.



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మునగపాక హైస్కూల్ విద్యార్థిని

విశాలాంధ్ర -మునగపాక: రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పి. మౌనిక అన్నపూర్ణ ఎంపిక అయ్యింది. నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోజరుగుతున్న ఈ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ చూపించి అండర్ -17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది . ఇటీవలె అనకాపల్లి మునిసిపల్ హైస్కూల్ లో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీలలో ఈమె ప్రతిభ చూసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా ఇందుపురం లో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో మౌనిక పాల్గొంటుందని ప్రధానోపాధ్యాయిలు ఎం. శ్రీనివాసరావు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్. సన్యాసిరావు తెలిపారు. ఈ బాలికను పాఠశాల ఉపాధ్యాయిలు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆదారి సూర్యచంద్ర రామారావు వైస్ చైర్మన్ బొడ్డేడ . గిరిజ కమిటి సభ్యులు అభినందించారు .

పల్లె పండుగతో కళకళ లాడుతున్న గ్రామాలు : ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర-కే కోటపాడు : ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగలో గ్రామాలు అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గ్రామ స్వరాజ్య స్థాపన లక్ష్యంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధితో ఒకేరోజు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి నిధులు విడుదల చేశారని అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పైడం పేట , మేడిచర్ల , ఆర్వె అగ్రహారం , ఏ కోడూరు , చౌడువాడ , గొండుపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల కు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కే కోటపాడు మండలంలో సెజ్ ఏర్పాటు చేసి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పోలవరం పూర్తయిన వెంటనే ఈ ప్రాంత రైతులకు రైవాడ జలాలను అంకితం చేస్తామన్నారు. మండలానికి కావలసిన మౌలిక వసతులపై స్థానిక నాయకులు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల దేశం పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్ , దాడి ఏరుకు నాయుడు , సబ్బవరపు రామ నాయుడు , జూ రెడ్డి రాము , కుంచ అంజిబాబు , కన్నూరు సూర్యనారాయణ , బండారు నరసింహనాయుడు , ఉపతాహసిల్దార్ రమేష్ బాబు ఏవో అప్పలరాజు ఎంఈఓ డివిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

28న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల విజ్ఞాపన సదస్సు

విశాలాంధ్ర-అనకాపల్లి: అగ్రిగోల్డ్ సంస్థలో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు కు 10 సంవత్సరాలు గా ప్రభుత్వాలు మారినా వారిచ్చిన వాగ్దానాలు అమలు జరపక బాధితులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి సిపిఐ కోడిగంటి గోవిందరావు భవన్లో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం సంఘం అధ్యక్షులు కరణం మాణిక్యాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా సంఘం గౌరవ అధ్యక్షులు వై ఎస్ భద్రం మాట్లాడుతూ. ప్రభుత్వాలు మారినా వారిచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోవడంతో బాధితులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని అగ్రిగోల్డ్ సంస్థ విలువైన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వాటిని అమ్మడం ద్వారా వచ్చిన సొమ్మును బాధితుల డిపాజిట్లు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తమ అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితులు అందరికీ న్యాయం చేస్తామని నమ్మబలికి అర కొర చెల్లింపులు చెల్లించి బాధితులని మోసం చేసిందని విమర్శించారు. సంఘం అధ్యక్షులు కరణం మాణిక్యాలరావు ,కార్యదర్శి గోపాల రమణ మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా బాధితులకు డిపాజిట్లు చెల్లించి ఆత్మహత్యలు నివారించడం ద్వారాసత్వర న్యాయం జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి మరొకసారి ఈనెల 28న విజయవాడలో జరిగే విజ్ఞాపన సదస్సు ద్వారా తెలియజేసేందుకు అగ్రిగోల్డ్ బాధితులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఆత్మహత్యలు చేసుకునిచనిపోయిన బాధితులకు ఎక్స్గ్రేషియా చెల్లించాలని వారు కోరారు . ఈ సమావేశంలో జెర్రిపోతుల దుర్గారావు, పోలమరిశెట్టి శేషు, మెల్లేటి గోపాల రమణ, కోన లక్ష్మణ,వై .సూరిబాబు, ఎం .చిన అప్పారావు, ఎస్ .అప్పారావు, మత్తుర్తి సూరిబాబు,జి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అర్జీలు పరిష్కరించాలి

కలెక్టర్ విజయ్ కృష్ణన్

విశాలాంధ్ర బ్యూరో- అనకాపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరే అర్జీదా రులతో అధికారులు నేరుగా మాట్లాడాలని కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. జిల్లాలో అర్జీల పరిష్కారం పరిస్థితిని జిల్లా కలెక్టరు సమీక్షించారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా అర్జీదారులతో మాట్లాడి వారు సంతృప్తిచెందే విధంగా పరిష్కారం చూపాలని తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను వివరించాలని తెలిపారు. అర్జీలపై తెలియజేసే సమాధానం విపులంగా, ఏస్థాయిలోను మరల వివరణ అవకాశం లేకుండా ఉండాలని తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టరుతో పాటు జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, ఎస్డిసి సుబ్బలక్ష్మీ, హౌసింగు పిడి శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ రోజు ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై 206 అర్జీలు అందజేసారు. రెవిన్యూ శాఖకు సంబంధించి 126, పంచాయతీ రాజ్ శాఖకు 19, పోలీసుశాఖకు 10, మునిసిపల్ శాఖకు 6,సర్వే శాఖకు 6, గ్రామీణాభివృద్ధికి 5, ప్రోహిబిషనుశాఖకు 4, ఇతర శాఖలకు 30 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో....

ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించ వలసిందిగా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయాలని ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు వచ్చిన 32 ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు తదితర ఫిర్యాదులు అందాయి. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ , అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు పాల్గొన్నారు.

పంటలు నీట మునగకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర -పాయకరావుపేట: పంటలు నీట మునగకుండా శాశ్వత పరిష్కారం చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండలం లోని పాల్తేరు రైతులు కోరుతున్నారు. ఈ మేరకు తహసిల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వర్షాలు, వరదలు వచ్చినప్పుడల్లా గ్రామంలోని కడిం చెరువులో అధికంగా నీరు చేరి, చెరువు పొర్లి పొంగి పక్కనే ఉన్న తమ పొలాలు నీట మునుగుతున్నాయని తెలిపారు. కష్టపడి పండించిన పంటలు ప్రతి ఏటా వరదలకు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోయారు. పంటలు నీట మునగకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని రైతులు సిద్ధ అయ్య రాజు, అనుసూరి సత్తిబాబు, అనుసూరి కొండయ్య, సిద్ధ వీరబాబు, గోనెల రాము, గోనెల సూరిబాబు, జమీలు శ్రీను తదితరులు కోరుతున్నారు.

ఉరకగెడ్డ పునరావాస బాధితులకు ఆర్ఆర్ ప్యాకేజీని అమలు చేయాలి

విశాలాంధ్ర -మాడుగుల : మాడుగుల మండలం శంకరం పంచాయతీ ఉరకగెడ్డ ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే ఆర్ఆర్ ప్యాకేజీ ద్వారా పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, మండల నాయకులు కె.భవాని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గిరిజనులుతో కలిసి ఉరకగెడ్డ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. రిజర్వాయర్ నిర్మాణం జరిగినప్పుడు బొడ్డరేవు, చినబొడ్డరేవు 56 గిరిజన కుటుంబాలకు చెందిన వారికి ప్రాజెక్టులో ముంపుకు గురైన వారికి ఆర్ఆర్ ప్యాకేజీ అమలు కోసం ప్రభుత్వ తేదీ. 08.04.2005న జీవో నెంబరు 68ను విడుదల చేయడం జరిందన్నారు. దీని ప్రకారం పునరావాస బాధితుల కుటుంబానికి ఒక్కొక్కకికి స్థలం, 56 కుటుంబాలకు అన్ని రకాల రాయితీలు కలుపుకొని ఆర్ఆర్ ప్యాకేజి ప్రకారం మొత్తం కుటుంబాలకు 5కోట్లు రూపాయలు వరకు మంజూరు చేస్తామని, జీవోలో పేర్కొన్నారని తెలిపారు. ఆర్ఆర్ ప్యాకేజీ ద్వారా గిరిజనులకు అందాల్సిన అన్ని రకాల పరిహారాలు గౌరవప్రదంగా చెల్లించకుంటే ప్రభుత్వ, అదికారులు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజనులు మువ్వల జానీ, బుసరి మల్లుదోర తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర-చీడికాడ : తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేస్తే అవి చట్టరీత్యా నేరమని హెచ్ఎం వరాహమూర్తి అన్నారు మండలంలోని వరహాపురం హైస్కూల్లో ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు మహిళా చట్టాలపై వీడియో ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు మానసికంగా వేధించడం వంటి పలు అంశాలు వివరించారు ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ గోవిందు మాట్లాడుతూ మహిళలకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడిన సచివాలయం పోలీస్ కు సమాచారము ఇవ్వాలన్నారు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం హైస్కూల్ లో నిర్వహించడం జరుగుతున్నదని అయన అన్నారు కార్యక్రమంలో సచివాలయం పోలీస్ ధనలక్ష్మి స్కూల్ కమిటీ చైర్మన్ మిస్కా అప్పారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పేద, మధ్య తరగతి ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్న

ప్రభుత్వ అధికారులను బర్తరఫ్ చేయాలి

సీపీఐ, అనుబంధ ప్రజా మహిళా సంఘాల డిమాండ్

పేదల నివాసాలు కూల్చి, కుటుంబాలను రోడ్ల పాల్జేస్తున్న అధికారులు

రెండు నెలలుగా మెయిన్‌రోడ్డుపై దర్జాగా కబ్జాచేస్తున్నా వారిపై చర్యలేవి?

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం ప్రధాన రహదారిలో వినాయకుడి గుడి ఎదురుగా ఓ నిరుపేదరాలు అన్నెపురెడ్డి వరలక్ష్మి ఇంటిని ఆగస్టు 27 తెల్లవారుజామున బుల్డోజర్లతో పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ కబ్జాదారులు, స్థానిక అధికార కూటమి ప్రభుత్వం నాయకులు సహకారంతో కూల్చివేసిన ఘటన పై నేటివరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, దర్జాగా ప్రభుత్వ భూములు కబ్జా లకు పాల్పడే వారికి వత్తాసు పలుకుతూ, వారిచ్చే లంచాలకు కక్కుర్తి పడుతూ పేదలు, బడుగు బలహీనవర్గాల ప్రజలను తీవ్ర భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని సి.పి.ఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏ.పి.రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి పల్లి అప్పలరాజు ఆరోపిస్తున్నారు. రెండు నెలలుగా అధికారులు కూల్చివేసిన ఇంటి వద్దే రాత్రనక, పగలనక నిరసనలు చేస్తుంటే అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టనట్లు వ్యవహరించడం వెనుక పెద్ద కుట్ర దాగివుందని తెలిపారు. నిరసన శిబిరం వద్ద సోమవారం కమ్యూనిస్టు నేత అప్పలరాజు మీడియాతో మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ అధికారులను తక్షణమే బర్తరఫ్ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ, అనుబంధ ప్రజా మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ, పంచాయతీ స్థలాలను, రోడ్లు, డ్రైనేజీలు, పాత చెరువును దర్జాగా కబ్జా చేసిన బడాబాబుల పై ఎటువంటి చర్యలు తీసుకోలేని అధికారులు కళ్ళు పేదల నివాసాలు పై పడ్డాయని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏ.పి. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపిస్తున్నారు. బడుగు, బలహీనవర్గాలు పేదలపై "ఆక్రమణలు పై చర్యలు" అంటూ పంజా విసిరిన పంచాయతీ, పోలీస్, రెవెన్యూ అధికారులు పై బాధిత కుటుంబాలు, సి.పి.ఐ. నేత రెడ్డిపల్లి, మహిళా సంఘాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ఉప సర్పంచ్ మారిశెట్టి సాగర్ ప్రోత్సాహంతో పంచాయతీ ఈ.ఓ. నారాయణరావు, పోలీసులు పేదలు నివాసాలపై దౌర్జన్యం చేయడం అన్యాయమన్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులకు, అధికార ప్రజా ప్రతినిధులకు దమ్ముంటే చోడవరం లో కబ్జాలకు పాల్పడ్డ బడాబాబులు పై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చోడవరం మేజర్ పంచాయతీ లో సుమారు 280 పైగా పంచాయతీ స్థలాలు కబ్జా కు గురయ్యాయని తెలిపారు. అధికార, ప్రతిపక్ష నేతలు అండదండలతో రెవెన్యూ సర్వే నెంబరు.82లో ప్రధాన రహదారిలో గల పాత చెరువు ఎండో మెంట్, ఆర్టీసి, పంచాయతీ, రెవెన్యూ అధికారులు సాక్షిగా కబ్జాకు గురయిందని తెలియజేసారు. అలాగే చోడవరం - లక్ష్మీపురం రోడ్డులో రెవెన్యూ సర్వే నెంబర్ 11లో సుమారు ఎ.0-60 సెంట్లు పైగా కబ్జా కు గురైనట్లు అప్పటి తహసీల్దార్ తిరుమల బాబు సిబ్బందితో అడ్డుకట్ట వేసినప్పటికీ, రియల్ ఎస్టేట్ మాఫియా ఇచ్చే లంచాలతో అధికారులు మొద్దు నిద్ర నటిస్తుండగా రియల్ మాఫియా బరి తెగిస్తున్నారన్నారు. బడాబాబులు, వారిచ్చే పారితోషికాలు (లంచం)తో వారి పట్ల విధేయత కలిగిన ప్రభుత్వ అధికారులు గరీబోళ్లపై చర్యలు తీసుకోవడం చేతగాక తరచూ పేదలు, బడుగు బలహీనవర్గాలు పై తమ దాష్టీకం చూపడం తగదని, దీనిపై బాధితులు పేదల పక్షాన భారత కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని తెలియజేసారు. డ్రైనేజీల పేరుతో నిరుపేదల ఇల్లు ధ్వంసం చేసే పంచాయతీ అధికారులు, ఏళ్ల తరబడి డ్రైనేజీలు ప్రక్కనే నిర్మాణాలు కట్టి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా ఎటువంటి నోటీసు, సమాచారం లేకుండగా మాజీ ఉప సర్పంచ్ సాగర్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావు, పేదలపై దౌర్జన్యం కు పాల్పడే పోలీసులు పై ఉన్నతాధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల తరపున డిమాండ్ చేశారు. అధికారుల అనైతిక చర్యలు వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ శక్తులు కొమ్ము కాస్తున్నారని స్థానికుల ఆగ్రహం చెందారు.

ఏదో జరిగింది లే...

మండల సర్వసభ్య సమావేశం తీరుపై విమర్శలు

వచ్చాం.. కూర్చున్నాము.. వెళ్ళాము అనే రీతిలోనే సభ్యుల వ్యవహారం

విశాలాంధ్ర - అనకాపల్లి: మండల ప్రజా పరిషత్ నిధులతో మండలంలో చేయవలసిన అభివృద్ధి కార్యక్రమాలు, చేసిన, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర వివరాలు అడగవలసిన సభ్యులు సమావేశానికి వచ్చాము. కూర్చున్నాము.. తిన్నాము.. వెళ్ళాము అనే పద్ధతిలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారంటే ఎంపీటీసీలు, సర్పంచులకు ఆ ఏ గ్రామాల అభివృద్ధిపై ఏ స్థాయిలో చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుంది. సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తీరు "ఏదో జరిగింది లే" అని మమ అనిపించారు. సమావేశం ప్రారంభం దగ్గర నుంచి ముగింపు వరకు ఇద్దరూ లేక ముగ్గురు మాత్రమే పదేపదే సమస్యలు ప్రస్తావ-నకు తీసుకువచ్చారు తప్ప మిగతా సభ్యులు ఉత్సవ విగ్రహాలు లాగా సభలో కూర్చుండి పోయారు. కొత్తగా బదిలీపై వచ్చిన అధికారుల పరిచయ కార్యక్రమం కొద్దిసేపు, అంగన్వాడీ సెంటర్లలో పిల్లలకు పరికరాల పంపిణీకి కొంతసేపు, ప్రాథమిక వైద్యశాలల్లో సిబ్బందికి పరికరాల పంపిణీ కి కొంతసేపు సమయం ఇచ్చారు తప్ప మండలంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారంపై సమగ్ర చర్చ జరగకపోవడం దురదృష్టకరం. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ఎమ్మెల్యే ఫోటో లేదని ఒకరు ఎంపీటీసీలు, సర్పంచులు కూర్చోవడానికి కూడా మండల పరిషత్ కార్యాలయంలో సరైన సదుపాయాలు లేవని మరొకరు పార్టీ, వ్యక్తిగత విషయాలపై మాట్లాడారు తప్ప అభివృద్ధిపై చర్చ జరగకపోవడం విడ్డూరం. సమావేశం మొత్తంలో వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు లేవనెత్తిన వైన్ షాప్ అంశం తప్పితే మరొకటి లేదు. వెంకుపాలెం రోడ్డులో బారు దాని సమీపంలో వైన్ షాపు ఏర్పాటు చేయడం వల్ల అటుగా వెళ్లే 14 గ్రామాలు ప్రజలు మందు బాబుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే అక్కడి నుంచి వాటిని తొలగించాలని డిమాండ్ చేయగా ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వటం లేదని, రూల్ పొజిషన్ పాటించలేదని వాదన, ఆర్ఇసిఎస్ ను మళ్లీ ఆర్ ఇ సి ఎస్ లో కొనసాగించేలా తీర్మానం చేయాలని మండల సర్పంచుల సంఘం ఇచ్చిన వినతి వరకు ఏదో తూతూ మంత్రంగా మండల సమావేశాన్ని ముగించేశారు.

వాటర్ బాటిల్స్ కి, బిస్కెట్స్ కి, టీ లకు, భోజనాలకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప సర్వసభ్య సమావేశం వల్ల ఎటువంటి ఉపయోగం లేదని కొంతమంది సభ్యులు ఆరోపిస్తున్నారు.

నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషను జారీ చేసినట్లు జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణణ్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరు ఛాంబరులో నిర్వహించిన పత్రికా విలేఖరుల సమావేశంలో జిల్లా కలెక్టరు ఎన్నికల నోటిఫికేషను వివరాలు తెలియజేసారు. జిల్లాలో ఒక మేజరు, మూడు మీడియం,ఒక మైనరు నీటి ప్రాజెక్టు సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని సాగునీటి వనరుల కింద ఉన్నటువంటి సాగునీటి సంఘా లకు అక్టోబరు 21 నుంచి నవంబరు 29వ తేదీ వరకు వివిధ దశలలో ఎన్నికలు నిర్వహించుటకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. జిల్లాలో పెద్దతరహా నీటిపారుదల వనరులు కింద తాండవ జలాశయం వస్తుందని తెలిపారు. ప్రాజెక్టు కమిటీలు 4, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 3, నీటి వినియోగ దారుల సంఘాలు 303 ఉన్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ రోజునుండి ఓటరు లిస్టులను శుద్ధీకరణ చేయడం జరుగుతుందని, ఇంతవరకు ఎన్నికలు జరుగని పెద్దేరు జలాశయానికి కొత్తగా ఓటరు లిస్టు తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఇతర శాఖల నుండి 668 గెజిటెడ్ అధికారులను పోలింగు అధికారులుగా, 1530 మంది పోలింగు సిబ్బందిని నియమించడంజరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎ.త్రినాథన్, డిఇ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీవో, తహశీల్దార్‌లకు సన్మానం

విశాలాంధ్ర-పాయకరావుపేట: పాయకరావుపేట మండలానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో జయప్రకాశరావు, తహశీల్దార్ సత్యనారాయణలను జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువా, పూలదండలతో ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గెడ్డం చైతన్య మండలంలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి పల్లి దుర్గారావు, మండల అధ్యక్షులు యగదాసు నానాజీ, పట్టణ అధ్యక్షులు ఆచంట దొర, జగ్గన్నదొర, గీసాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం గ్రామసభలో 97 ప్రజా అర్జీలు

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు మండలంలోని భోగాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో 97 భూ సంబంధిత రెవెన్యూ సమస్యలు పై అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఏ.రామారావు తెలియజేసారు. భోగాపురం గ్రామంలో లాండ్ పార్సెల్ మ్యాప్ (ఎల్.పి.ఎం) 2627 లు వుండగా మొత్తం రెవెన్యూ విస్తీర్ణం ఎ. 932.368 సెం.లు గలదని తెలియజేసారు. రీ సర్వే గ్రామ సభలు లో భూ సంబంధిత, రెవెన్యూ సమస్యలు ప్రజలు అందించిన అర్జీలకు అధికారులు నెలరోజులు కాలపరిమితిలో పరిష్కరిస్తామని తెలిపారు. భూ రికార్డులు, సర్వే నెంబర్ సబ్ డివిజన్, పేర్లు తప్పులు, భూ తగాదాలు, అన్నదమ్ముల పంపిణీ, కోర్టు వ్యవహారాలు తదితర అన్ని అంశాలపై అవకాశమున్నంత వరకు రైతాంగ సమస్యలు పరిష్కారం చూపుతామని, లేనిచో ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణణ్ పేర్కొన్నారు. సోమవారం అక్టోబర్ 21న అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జరిగింది. అమరులైన పోలీసుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో శాంతి భద్రతలు పరిరక్షణ కొరకు అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని, ప్రతీ ఒక్కరూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పోలీసు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తపరుస్తూ, పోలీసు కుటుంబాలకు ఎటువంటి సమస్యలు ఉన్నా తక్షణమే పరిష్కరి స్తామని భరోసా ఇచ్చారు. జిల్లా అదనపు ఎస్పీ శ్రీ ఎల్.మోహన్ రావు మాట్లాడుతూ అక్టోబర్ 21, 1959న చైనాతో మన సరిహద్దును రక్షించే క్రమంలో ప్రాణాలర్పించిన 10 మంది సిఆర్పిఎఫ్ జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలను కొనియాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినం స్మృత్యార్థం జరుపు కుంటున్నామన్నారు. పోలీసు సిబ్బంది వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి పలు చర్యలు చేపట్టడం జరిగింది అని తెలిపారు. అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని, పోలీసు కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో పోలీసు అమరవీరుల స్మృతి స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించి, గౌరవ వందనం చేసి, పుష్ప గుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. సోమవారం అక్టోబర్ 21 నుండి 31 రాష్ట్రీయ ఏక్తా దివాస్ వరకు పోలీసు అమర వీరుల త్యాగాలు గుర్తు చేసుకుంటూ ప్రజల్లోనికి వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అమరులైన పోలీసు కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులు పోలీసు అమరుల స్మృతి స్తూపానికి శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా 13 మంది అమరవీరుల ఒక్కొక్క కుటుంబానికి రూ:10 వేలు నగదు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమములో అనకాపల్లి సబ్ డివిజన్ ఇంచార్జ్ డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, పరిపాలనాధికారి శ్రీ ఎ.రామ్ కుమార్, ఇన్స్పెక్టర్లు బాల సూర్యారావు, లక్ష్మి, వినోద్ బాబు, రమేష్, మన్మథరావు, సతీష్, నరసింహమూర్తి, సంజీవరావు మరియు ఇతర జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ధర్మవరం విద్యార్థులు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్- 17 హాకీ విభాగంలో ఎంపికయ్యారు. విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయరాలు దీపికను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు అభినందించారు. విశాఖపట్నం లో జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 17 హాకీ క్రీడాల్లో రాష్ట్ర స్థాయికి టి వివేక్, కె మనోజ్, బి.జయశ్రీ, కె.తోనేశ్వరి ఎంపికయ్యారు. వీరికి నెల్లూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితాంబ, కుసుమ కుమారి, విజయ కుమారి, శోభారాణి, ఆర్.అప్పలనాయుడు, గారా ప్రకాష్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ నిధులతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ, గవర్ల అనకాపల్లి గ్రామంలో జెడ్పీటీసీ పెంటకోట సోము సత్యనారాయణ నిధులు రూ.5 లక్షలు, ఎంపిటిసి కాండ్రేగుల వెంకటలక్ష్మీ నిధులు రూ.3 లక్షలతో ఆవ కాలువకు ఆనుకొని ఉన్న రింగ్ రోడ్డుకి డ్రైనేజీ నిర్మాణం, శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకై సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు కూటమి నేతలతో కలిసి సోమవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు పంచాయతీ నిధులతో రెండు గ్రామాలను ఎంతగానో అభివృద్ధి చేశామన్నారు. ఇదంతా ప్రజల సహకారంతోనే సాధ్యమైందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రోత్సాహం పంచాయతీ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

విశాలాంధ్ర - అనకాపల్లి: ఉడ్డిపేటలో గల విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏ.డి జి.వి.బి.జగదీష్ సహకారంతో 10 పది మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో నిస్సహాయులైన దివ్యాంగుల కొరకు గత ప్రభుత్వంలో ఇచ్చే డి.ఎం హెచ్.ఓ మెడికల్ పెన్షన్లు 5000 వేళ రూపాయల నుంచి 15 వేల రూపాయలకు పెంచి, దివ్యాంగుల జీవన భృతి కొరకు ఎన్టీఆర్ భరోసా క్రింద 15000 వేళ రూపాయల డి.ఎం హెచ్.ఓ మెడికల్ పెన్షన్లు మంజూరు చేస్తున్నారని, అనకాపల్లి జిల్లాలో ఎన్టీఆర్ భరోసా క్రింద ఇచ్చే 15000 వేళ రూపాయల డి.ఎం హెచ్.ఓ మెడికల్ పెన్షన్లకు అర్హులైన దివ్యాంగులకు సంబంధిత జిల్లా హాస్పి టల్‌లో ధ్రువీకరణ పత్రాలు పొందినప్పటికీ, జిల్లాలో ఉన్న పి.హెచ్.సి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, యు.పి.హెచ్.సి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అధికారులకు, సిబ్బందికి, ఈ ఎన్టీఆర్ భరోసా మెడికల్ పెన్షన్ల నమోదు విషయంలో సరైన అవగాహన లేక జిల్లాలో అర్హులైన దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంలో డి.ఎంహెచ్.ఓతో మాట్లాడి జిల్లాలో ఉన్న పి.హెచ్.సి, యు.పి.హెచ్.సి అధికా రులకు, సిబ్బందికి అవగాహన కల్పించాలని జిల్లాలో దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయాలని. జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏ.డి జి.వి.బి జగదీష్‌ని కోరినట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెం ట్ వియ్యపు రమేష్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో తుఫాన్ కంట్రోల్ రూమ్

విశాలాంధ్ర - యస్.రాయవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం తుఫాను ప్రభావం ఉండడంతో యస్.రాయవరం తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ జె.రమేష్ బాబు ప్రకటించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తుపాను ప్రభావంతో మూడు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉండడం వల్ల కంట్రోల్ రూమ్ పెట్టడం జరిగిందని ఏ సమస్య ఉన్న కంట్రోల్ రూమ్‌కు 90 323 14 938 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని వెల్లడించారు. ఇప్పటికే గ్రామంలోని రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు.